# చూపులు

పి.బి.రాజు



బస్సు బయలుదేరడానికి ఇంకా పది హేను నిమిషాలుంది.

విసుగ్గా గడియారంవైపు చూసుకొంటూ కూలింగ్‌గ్లాసును సవరించుకొంది రాధిక.

అప్పుడే ఆరున్నరయింది. ఒగ్గంట ప్రయాణం. రోడ్లోనుండి మరో మైలు నడిస్తేనేగానీ తను చేరాల్సిన పల్లె రాదు.

అసలు ఆ పల్లెటూరి ప్రయాణం అంటేనే ఆమెకిష్టంలేదు.

కాని మిత్రురాలి పెళ్లి. నిర్మల తన బెస్ట్ ఫ్రెండ్. "పెళ్లికి రాకపోతే చంపేస్తాను' అని ఇన్విటేషన్ ఇచ్చినపుడే చెప్పివెళ్లింది నిర్మల. వెళ్లకపోతే బాగుండదు.

ఇప్పుడే ఆఫీసులో ఆ వెధవ ఇన్స్పెక్షన్ ఒకటి. అది లేకుంటే ఒక రోజు లీవుపెట్టేసి వెళ్లుండొచ్చు. అట్లీస్ట్ వన్నవర్ పర్మిషన్ అడిగినా ఇవ్వలేదు ఆఫీసరు.

ఎలాగో ఆరుగంటలకు తప్పించుకోగల్గింది.

వెంటనే ఇంటికిపోయి స్నానంచేసి; కాఫీ తాగి హడావుడిగా బయలుదేరింది.

తాను ఎంత ఆత్రపడ్తుందో అంత నిదానంగా బయలుదేరేట్లు ఉంది బస్సు.

'ఇంతకీ ముహూర్తం ఎన్ని గంటలకో' అంటూ ఇన్విటేషన్ చూసింది

రాధిక.

తెల్లారుఝామున 4. 30– 6. 00.

ఇన్విటేషన్‌ను మడిచి సూట్ కేసులో పెట్టబోయి త్రుళ్లిపడి అటు చూసింది.

తనవైపే తదేకంగా చూస్తున్నాడు ఒక యువకుడు.

ఆమె అతనివైపు చూసేసరికి అతని చూపులు తప్పుకున్నాయి.

పక్క సీట్లో కూర్చొని పదేపదే తనవైపే చూస్తున్న అతన్ని అసహ్యించుకొంది మనసులోనే రాధిక.

ఎత్తుకు తగ్గ లావు, నొక్కుల హిప్పీ జుట్టు, కూలింగ్ గ్లాసుతో సీట్లో ఠీవిగా కూర్చొని ఆమెవైపే చూస్తున్నాడు ఆ యువకుడు.

"తినేసేట్లు వాడి చూపూ? వాడూనూ!" మనసులోనే గొణుక్కుంది రాధిక.

'అసలు ఆడది ఒంటరిగా కనిపిస్తే చాలు, కొరుక్కు తినేసేట్లు ఎందుకలా చూస్తారు? కూలింగ్‌గ్లాసు వేసుకుంటే ఎటువైపు చూస్తున్నదీ ఎదుటి వ్యక్తికి తెలియదనుకొన్నాడేమో? నాన్సెన్స్' అని పళ్లు కొరుక్కుంది.

ఇంతలో కండక్టర్ టికెట్ అడిగాడు.

"నిమ్మలూరు." టికెట్ తీసుకొంది రాధిక.

ఆ తర్వాత కండక్టర్ ఎదురుగా వున్న ఆ యువకుణ్ణడిగాడు.

ఆ యువకుడు పదిరూపాయల నోటిస్తూ రాధిక వైపు చూసి, 'ఒకటి' అన్నట్టు ఒక చేతివేలు చూపించాడు.

"ఏమిటి? నీవు కూడా నిమ్మలూరేనా?"

ఔనన్నట్టు తలాడించాడు యువకుడు.

టికెట్టిచ్చి కండక్టర్ వెళ్లిపోయాడు.

'ఏమిటి? వీడు నిమ్మలూరు వస్తున్నాడా? ఎంత పొగరు? టికెట్టిస్తుంటే నా వైపు చూపిస్తాడేమిటి? కొంపముంచి అక్కడెక్కడైనా అల్లరి చేయడు గదా! అసలే చీకటిపడిపోయింది!' గాబరాపడ్తోంది రాధిక మనసు.

అలా చూస్తాడేమిటి?

సూటిగా...

కొంటెంగా....

గుండెల్లోకి దూసుకుపోయేట్లుగా–

వెధవ చూపూ! వాడి మొఖమూను!

అలా పిక్కి పిక్కి మెడవైపు చూస్తాడేమిటి?

పెళ్లయిందా లేదా తెలుసుకోవడానికి. మంగళసూత్రం వుందో లేదో తెలుసుకోవడానికి కాబోలు.

ఆమె కోపం వచ్చింది.

కొంగుతీసి భుజాల నిండుగా మెడ కన్పించకుండా కప్పుకుంది.

'ఎందుకలా మింగేసేలా చూస్తారూ!' అని అడిగేయాలనిపించింది.

కావి 'నేను ఏమ్మా చూడలేదు' అని జారుకుంటే తన పరువేం కావాలి. అని తమాయించుకొంది.

'ఛీ ... ఛీ.... అసలు ఈ కాలపు యువకులే ఇలా చెడిపోయారు. ఆడాళ్ల కన్పిస్తేసరి నఖశిఖ పర్యంతం తమ ఎక్స్‌రే కళ్లతో పరిశీలించేస్తారు; వాళ్లే మనుకొంటారో అనే భావన కూడా లేకుండా! అడాళ్లనే ఎప్పుడూ చూడనట్లు ఏవో వింత జంతువులయినట్లు చూస్తారు. ఇలాంటి రోమియోలకంతా తగిన బుద్ధి చెప్పాలి.' అనుకుంటూనే అతని వైపు చూసి ఉలిక్కిపడింది.

అతను వంగి తన పాదాలవైపు చూస్తున్నాడు.

'రాస్కెల్ !' ఆమె పెదవి కొరికింది

పాదాలు కన్పించకుండా చీరకుచ్చిళ్లున్నాయి.

పాదాలు కన్పిస్తాయేమో; మట్టెలున్నాయో లేవో చూడాలని అతని తాపత్రయం కాబోలు.

'ఇంకా ఎంతసేపు చూస్తాడు! వెధవన్నర.... వెధవ....'

పెళ్లికాని కన్నెపిల్లల్ని అల్లరి చేస్తారు. అదే పెళ్లయినవారిని చూస్తే తోక ముడుచుకొని వెకిలిచేష్టలు మానుకొని గుట్టుగా వుంటారు. అందుకే ఎక్కడికైనా బయలుదేరేటప్పుడు ఓ పసుపుతాడు కట్టుకొస్తే ఇలాంటి రోమియోల చూపుల బాధలు తప్పుతాయి- కసిగా గొణుక్కుంటోంది ఆమె.

వాడింకా బాగా వంగి తన పాదాలకేసి చూస్తున్నాడు.

'కొంప ముంచి చీరకుచ్చెళ్ల పైకితీసి చూడడు గదా !'

ఆమెకు ముచ్చెమటలు పోశాయి.

బస్సులో ఎవరి హడావుడిలో వారు వున్నారు.

ఎంత ధైర్యం వాడికి! ఇంత పబ్లిక్‌లో ఎంత ధైర్యంగా ఒక ఆడదాని పాదాలవైపు ఒక యువకుడు అలా తదేకంగా చూస్తుంటే ఇంతమందీ ఏం చేస్తున్నట్లు ?

'ఏంటండీ ? ఏమిటా చూపు' నోటిదాకా వచ్చిన మాటలు ఆగిపోయాయి.

ఇలాంటి వెధవలదగ్గర నోరిస్తే! రేపో మాపో ఒంటరిగా చూసి అల్లరి చేసేస్తారు.

భరించక తప్పదు.

పాదాల్ని వెనక్కి తీసుకొంది. అలా తీసుకొనేటప్పుడు పాదాలు కన్పించకుండా జాగ్రత్తపడింది.

వెంటనే ఆ యువకుడు చేతుల్ని ఆమె పాదాలవైపు పోనిచ్చాడు.

భగవంతుడా! ఏమిటిది ? వాడు ఇంత ధైర్యంగా.... పాదాల్ని ఏం చేస్తాడో!

పెనుతుఫానులో చిగురుటాకులా వణికిపోయింది రాధిక.

తన పాదాలదగ్గర పడిపోయిన లాకెట్‌ను తీసుకొని, తన స్థానంలో

వర్రికూర్చొని చిద్విలాసంగా నవ్వాడు.

'అమ్మయ్య' అనుకొంది రాధిక.

గుండెల్నిండా గాలి పీల్చుకుని వదిలింది.

ఏదో పెద్ద బరువు తీసేసినట్లు మనసు తేలికపడింది.

లాకెట్ జారిపడిపోయుంటే 'ఎక్స్క్యూజ్‌మీ!' అని చెప్పి డైరెక్టుగా తీసుకుని వుండొచ్చుగా?

నో.... ఇందులో ఏదో వుంది.

ఏదైనా అఘాయిత్యం చేసేముందు ఇలాంటి ప్రిలిమినరీ టెస్టులుచేసి ఆమె ఎలాంటిదో కనుక్కొని, దానికి తగిన రీతిన అఘాయిత్యానికి పాల్పడుతారేమో!

వెధవన్నర ... వెధవ. వీణ్ని నమ్మకూడదు.

అలా చూస్తాడేంటి?

వాడిగా....

వేడిగా...

క్రూరంగా....

కర్కశంగా.... మృగంలా!

తనవైపు చూస్తూ పళ్లు నూరుకొంటున్న రాధికను చూసి చిన్నగా నవ్వాడు ఆ యువకుడు.

'వెధవ నవ్వు.... సినిమా విలన్లా!' మొహం చిట్లించిందామె.

ఎప్పుడో రెండేళ్లక్రితం నిర్మల బలవంతాన వూరొచ్చిపోయింది రాధిక.

'ఛ.... ఛ.... ఏం పల్లెటూరో! ఆటోలు లేవు. రిక్షాలు లేవు. బస్సులు లేవు. రోడ్డునుండి ఒకమైలు నడిస్తేగాని ఆ పల్లె రాదు. ఏమైనాగానీ బస్సు ఆగి ఆగగానే వెంటనే దిగేసి వడివడిగా నడవాలి. వాడికి అందకుండా పరుగెత్తాలి. ఎలాగైనా వాడికి కన్పించకుండా పారిపోవాలి.' అనుకొంది రాధిక.

బస్సు ఆగింది.

"పమ్మలూరు దిగండి" అరిచాడు కండక్టరు.

వడివడిగా లేచి సూట్‌కేసు తీసుకొని బస్సు దిగబోయి ఎవరో పట్టిలాగినట్లు తూలిపడబోయి, నిలద్రొక్కుకొని 'ఎవర్రా!' అన్నట్టు వెనక్కితిరిగి చూసింది.

ఆ యువకుడు అక్కడ నిల్చుని వున్నాడు.

పెద్దగా నవ్వుతూ—

అతని ముప్పైరెండు పళ్లు స్పష్టంగా కన్పించేట్లు—

రాక్షసంగా—

వికృతంగా—

హిందీసినిమా విలన్‌లా—

ఆమె గుండెల్లో రైళ్లు పరుగెత్తాయి.

'ఈ విలన్‌గాడికి ఎంత ధైర్యం? పైట పట్టుకొంటాడా?'

ఇంతలో బస్సు కమ్మికి తగుల్కొన్న తన పైటకొంగును తీసి వదిలాడు కండక్టరు.

'అమ్మయ్యా!' చిన్నగా నిట్టూర్చింది రాధిక.

ఇంకెవరైనా బస్సు దిగుతారేమోనని ఎదురుచూసిందామె.

కాని ఆ బస్సులోంచి దిగింది ఇద్దరే.

ఆ యువకుడు_ తను.

ఎవరైనా దిగుంటే కొంత ధైర్యంగా వుండేది.

ఇక ఆ ధైర్యమూ లేదు.

చీకటిపడిపోయింది.

మట్టిరోడ్డు.... చిన్న చిన్న గుట్టల సందుల్లోంచి సన్నని యిరుకు దారి....

దారి సరిగ్గా కన్పించటంలేదు. భయంగా వుంది.

ఆమె అదంతా ఆలోచించలేదు.

పడివడిగా పెద్దపెద్ద అంగలేస్తూ నడవసాగింది. అది నడక కాదు పరుగే.

ఆ యువకుడు ఆమె వెంట పరుగు తీశాడు

ఆమె ఒకటే పరుగు.

ఆమె వెంట అతని పరుగు.

ఒక్కసారి వెనక్కి తిరిగి చూసింది రాధిక.

గుండె ఆగినంత పనయింది.

తన వెంటే.... పరుగెట్టి వస్తున్నాడు.

రాధిక తనను తాను తిట్టుకొంది. ఇక పొద్దుపోయిన తర్వాత వచ్చినా ఏ ఊరికీ బయలుదేరనని; ఈ ఒక్కసారి గండం గట్టెక్కించమని కోటి దేవతలకు మొక్కుకుంది.

అదిగో.... అతను వచ్చేశాడు!

తెలుగు సిన్మాలో విలన్లా—

హీరోయిన్‌ను రేప్‌చేసే విలన్లా—

రాక్షసుడిలా.... బెబ్బులిలా....

ఇక తన గతేం కావాలి? ఈ రోజుతో తన బ్రతుకు గోవిందార్పణం!

ఆమె వణకిపోయింది.

బెదరిపోయింది.

ఆమె కాళ్లకు అంతటి శక్తి ఎలా వచ్చిందో?

మళ్లీ పరుగు అందుకొంది.

ఎంత వేగమో చెప్పలేము.

బస్సుకన్నా... రైలుకన్నా .... విమానంకన్నా.. ఇంకా.... ఇంకా.... వేగంగా

ప్రాణాలు కాపాడుకోవాలని.

ప్రాణప్రదమయిన శీలాన్ని కాపాడుకోవాలని ...

గస.... అలసట .. నిస్సత్తువ.... నీరసం.... కాళ్లు నొప్పులు..

పరుగెత్తే ఓపికలేదు

మళ్లీ అదిగో అతను!

వాకేకొనునే మృత్యువులా....

ఎత్తుకుపోయే సుడిగాలిలా...

ముంచేసే వెల్లువలా...

ఆమె పరుగు ఆపలేదు

అతనూ పరుగు ఆపలేదు.

పరుగు.... పరుగు.... పరుగు ...

తనను తాను రక్షించుకోడానికి పరుగు.

రాక్షసుడ్నుంచి తప్పించుకోవడానికి పరుగు.



బ్రతకడానికి పరుగు....

అమ్మయ్య! అదిగో పల్లె వచ్చేసింది.

అదిగో. పెళ్లిపందిరి.

అదే పెళ్లివారిల్లు. నిర్మల ఇల్లు.

వచ్చేసింది. తను వచ్చేసింది. క్షేమంగా వచ్చేసింది.

పరుగునపోయి నిర్మలదగ్గర పడిపోయింది రాధిక.

రాధికను ఆ అవతారంలో, ఆ పరుగులో చూసి అందరూ ఆశ్చర్యపోయారు.

జరిగిందంతా నిదానంగా చెప్పింది రాధిక.

ఆ యువకుడ్నుంచి ఎలా తప్పించుకొచ్చిందీ వివరంగా చెప్పింది. అందుకే పరుగెత్తుకొచ్చానంది.

ఆ గదిలోని ఆడవారంతా ఆ యువకుడ్ని తిట్టిపోశారు.

• • •

పెళ్లి జరిగిపోయింది.

మిత్రులంతా చేరుకొని వధూవరులను అల్లరిచేస్తున్నారు.

"నేను వెళ్లొస్తానే!" అంటూ నిర్మలకు చెప్పడానికి వచ్చిన రాధిక.... అతన్నిచూసి "అదిగో... వాడే....వాడే రాత్రి నన్ను తరుముకొచ్చింది" అంది.

అదే సమయానికి ఆ యువకుడు పెళ్లి కుమారునికి రాధికను చూపిస్తున్నాడు.

పెళ్లికుమారుడు రాధికను పిలిచాడు.

రాధిక భయపడుతూనే వెళ్లింది.

"మావాడి తరపున మీకు కృతజ్ఞతలు తెలుపుతున్నాను" అన్నాడు పెళ్లి కుమారుడు.

"ఎందుకు" అంది విసురుగా రాధిక.

"మావాడికి ఈ పల్లెటూరు తెలియదు. రాత్రి బస్సులో కూర్చుంటే మీరు మా వెడ్డింగ్ ఇన్విటేషన్ చూస్తున్నారట. అది చూసి మీరుకూడా పెళ్లికేవస్తున్నట్లు తెలుసుకొని; మీరు దిగిన చోటునే దిగి మీతోబాటే వచ్చాడట. మీతో పాటు పరుగెత్తి పరుగెత్తి పాపం చాలా అలసి పోయాడు వాడు. మీరు లేకుండా వుండి వుంటే చాలా అవస్థపడుండేవాడు. ఈ సంగతి నాకు రాత్రే చెప్పాడు. మీకు థాంక్స్ కూడా చెప్పమన్నాడు." అన్నాడు చిన్నగా నవ్వుతూ పెళ్లికొడుకు.

ఆ యువకుడు వినయంగా నమస్కరించాడు

"ఆ థ్యాంక్సేదో అతనే చెప్పొచ్చుగా! మధ్యలో మీరెందుకు చెబుతున్నారు?" అంది రాధిక కోపంగానే.

"అయాం సారీ! వాడు మూగవాడు. మాటలు రావు!"

స్థాణువై ఆ యువకుని వైపు చూసింది రాధిక.

"అతని సిస్టర్ అచ్చం మీలాగే వుండేది. అర్నెల్లక్రితం యాక్సిడెంట్‌లో పోయింది పాపం! బస్సులో మిమ్మల్నే చూస్తూ వాడి సిస్టర్‌ని తలుచుకొని బాధ పడ్తూ వచ్చాడట."

ఆ యువకుని కళ్లు బరువుగా వాలి పోతున్నాయి. ఆ వాలిపోయిన కళ్లనుంచి రెండు కన్నీటిబొట్లు వెచ్చగా రాలాయి.

"అయాం సారీ!" అప్రయత్నంగానే ఆమె కళ్లు వర్షించాయి. రాత్రి అనవసరంగా ఏవేవో ఊహించుకొని భయపడిపోయి, అలా ప్రవర్తించినందుకు ఆమె చాలా బాధపడింది అతన్ని నీచంగా అంచనా వేసినందుకు సిగ్గు పడింది కూడా.

"క్షమించండి" అంది చిన్నగా.

ఆ యువకుడు సజల నయనాలతో ఆమెవైపు చూశాడు.

ఇప్పుడా చూపులు—

పాలసముద్రపు నురగల్లా

వెన్నెల కెరటాల్లా

చిరుగాలి తరగల్లా

ఎంతో స్వచ్ఛంగా: నిర్మలంగా: నిష్కల్మషంగా ఉన్నాయి.